సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 25 । సెప్టెంబర్ । 2024



మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మదనపల్లె సర్వజన బోధన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. ఎంఎస్ రాజు అన్నారు. -8లో



రెండు కిలోల గంజాయి స్వాధీనం

మదనపల్లె పట్టణంలో 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ కె.రామచంద్ర తెలిపారు. -8లో



కబ్జా కోరల్లో 'లోతు వంక' చెరువు!

కురబలకోటలో చెరువులను కబ్జా చేస్తున్నారు కొందరు అక్రమార్కులు. వీరికి కొందరు నాయకుల ఆశీస్సులతో పాటు రెవెన్యూ అధికారులు అండదండగా నిలుస్తున్నారు. -8లో

కడపపై ఎందుకీ వివక్ష!

- కొప్పర్తిలోని టెక్నాలజీ సెంటర్ అమరావతికి తరలింపు
- బాబు హయాంలో మళ్లీ మొదలైన తరలింపు వ్యవహారం
- 2014–19 మధ్య ఉర్దూ యూనివర్సిటీ కర్నూలుకు తరలింపు
- ఆది నుంచి అంతే.... 2024లో సీట్లిచ్చినా మారని సీన్
- ప్రస్తుతం సెంటర్ తరలింపునకు జీఓ నం.56 జారీ



కొప్పర్తి పారిశ్రామికవాడ

సాక్షి కడప /సెవెన్‌రోడ్స్: ఆది నుంచి అంతే... చంద్రబాబు తీరులో ఏమాత్రం మార్పు లేదు. అంతకుమునుపు ఓట్లు, సీట్లు అంటూ కడపకు ఏమీ చేయని సీఎం ప్రస్తుతం ఇక్కడ ఉన్న వాటికి ఎగనామం పెడుతున్నారు. రాజకీయ కక్షలో భాగంగా కడపకు కడుపు మంట మిగుల్చుతున్నారని రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన ప్రతిసారి ఏదో ఒక రకంగా కడపపై వివక్ష చూపుతూ వస్తున్నారు. ఈసారి 2024 ఎన్నికల్లో కడప నుంచి సీట్లు ఇచ్చినా కక్ష మాత్రం వీడలేదు. పులివెందుల మెడికల్ కళాశాల ప్రవేశాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు మోకాలొడ్డిన సంఘటన జిల్లా ప్రజలు మరువకముందే తాజాగా ఆయన మరో భారీ షాక్ ఇచ్చారు. భారత ప్రభుత్వం గతంలో కొప్పర్తి మెగా ఇండస్ట్రీయల్ హబ్‌కు మంజూరు చేసిన రెండవ ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ కమ్ టెస్టింగ్ ఫెసిలిటీని అమరావతికి తరలించారు. అన్నిరంగాల్లో వెనుకబడిన జిల్లాను సమగ్రాభివృద్ధి చేయాల్సిందిపోయి అంతో ఇంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ఇలాంటి పరిశ్రమలను కూడా అభివృద్ధి చెందిన ప్రాంతానికి తరలించుకుపోవడంపై జిల్లా ప్రజలు మండిపడుతున్నారు.

గతంలో ఉర్దూ యూనివర్సిటీకి మంగళం

సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో అధిక శాసనసభ స్థానాలను టీడీపీకి కట్టబెట్టినా ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాకు ద్రోహం చేస్తూ మళ్లీ తరలింపుల పర్వానికి తెర లేపారు. అంతకుముందు 2014–19 మధ్య కాలంలో కడపకు వచ్చిన ఉర్దూ యూనివర్సిటీని కర్నూలుకు తరలించిన బాబు సర్కార్, ఇప్పుడు టెక్నాలజీ సంస్థను ఎగరేసుకుని పోయారు. గతంలో నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు భారత ప్రభుత్వం గుంటూరులో టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు అనుమతించింది. ఇందుకు అవసరమైన భూమి అందుబాటులో ఉండాలి. అయితే గుర్తించిన భూమి నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకానికి అవసరం కావడంతో టెక్నాలజీ సెంటర్‌కు తగిన భూమి అందుబాటులో లేదంటూ ఆనాటి గుంటూరు జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి స్పష్టం చేశారు. దీంతో నాటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రెండవ ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను కడపలోని కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో ఏర్పాటు చేయాలని భారత ప్రభుత్వం ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖకు ప్రతిపాదనలు పంపారు. దీంతో భారత ప్రభుత్వం రూ. 250 కోట్ల అంచనా వ్యయంతో టెక్నాలజీ సెంటర్‌ను కొప్పర్తి మెగా ఇండస్ట్రీయల్ హబ్‌కు మంజూరు చేసింది. కొప్పర్తిలోని నార్త్ బ్లాక్‌లో 19.5 ఎకరాల విస్తీర్ణంలో ఉచిత లీజు ప్రాతిపదికన ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశారు. టెక్నాలజీ సెంటర్ కార్యరూపం దాల్చి ఉంటే పలువురికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించి ఉండేవి.

అమరావతికి తరలిస్తూ జీఓ జారీ

జిల్లాలోని కొప్పర్తిలోగల టెక్నాలజీ సెంటర్ అమరావతికి తరలిస్తూ బాబు సర్కార్ మంగళవారం జీఓ నెం. 56ను జారీ చేసింది. కడపకు మంజూరైన ప్రాజెక్టు తరలింపుపై అన్ని వర్గాల ప్రజలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ప్రతిసారి రాజకీయ దెబ్బతో జిల్లా ప్రజలకు తీరని అన్యాయం జరుగుతోంది.

కడపకు తీరని అన్యాయం



టెక్నాలజీ సెంటర్ తరలింపుతో జిల్లాకు తీరని అన్యాయం జరిగింది. జిల్లాకు చెందిన నిరుద్యోగులకు కొంతమేర అవకాశాలు ఉండేవి. వైఎస్సార్ సీపీ హయాంలో గుంటూరులో భూమి అవకాశం లేకపోవడంతో అప్పటి సీఎం వైఎస్ జగన్ కొప్పర్తిలో టెక్నాలజీ సెంటర్‌కు భూమి ఇవ్వడంతోపాటు సౌకర్యాలు కల్పించడంతోఈ ప్రాంతానికి మంజూరైంది. అంతర్జాతీయ ఇంజనీరింగ్ ప్రమాణాలు, స్కిల్ నైపుణ్యాలలో శిక్షణ కల్పించేందుకు తీసుకొచ్చిన టెక్నాలజీ సెంటర్ తరలిస్తూ జీఓ ఇవ్వడం అన్యాయం.

– రాజోలి వీరారెడ్డి, రాష్ట్ర పరిశ్రమలశాఖ మాజీ సలహాదారు, కడప

జగన్ పరిశ్రమలు తెస్తే...బాబు తరలిస్తున్నారు



వైఎస్సార్ హయాంలో కొప్పర్తికి భూమి కేటాయింపుతోపాటు పరిశ్రమలను తీసుకొచ్చేందుకు అభివృద్ధి చేశారు. తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కొప్పర్తికి అనేక పరిశ్రమలు తీసుకొచ్చారు. ప్రధానంగా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుకు వెళ్లింది. అయితే ఇప్పుడు రాజకీయాల కోసం బాబు అధికారంలోకి రాగానే ఇక్కడి సంస్థలను కూడా అమరావతికి తరలిస్తున్నారు. ఇది కడపజిల్లా ప్రజలపై మంటతోనే బాబు ఇలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

– పి.రవీంద్రనాథ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, కడప

ఉపాధి అవకాశాలు దెబ్బతీయడమే..



కొప్పర్తి సెజ్‌లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను జీఓ నెం.56 ప్రకారం అమరావతికి తరలించడం వైఎస్సార్ జిల్లా యువత, నిరుద్యోగుల ఉపాధి అవకాశాలను విచ్ఛిన్నం చేయడమే. ఇటీవల పులివెందుల మెడికల్ కళాశాలకు సీట్లు వద్దని లేఖ రాసిన ముఖ్యమంత్రి చంద్రబాబు అంతలోనే కొప్పర్తి టెక్నాలజీ సెంటర్‌ను అమరావతికి తరలించేందుకు జీఓ జారీ చేయడం యువత ఆశలపై నీళ్లు చల్లడమే అవుతుంది.

–రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత

న్యూస్‌రీల్

నవోదయ దరఖాస్తుకు గడువు పొడిగింపు

రాజంపేట: జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవడానికి అక్టోబరు 7వతేది వరకూ గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ గీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

రాష్ట్ర సరిహద్దు పరిశీలన

బి.కొత్తకోట: కర్నూలు రేంజి డీఐజీ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు మంగళవారం బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండల సరిహద్దులోని కర్ణాటక–ఆంధ్రా సరిహద్దును పరిశీలించారు. మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై విడిది చేసిన ఆయన ఇక్కడి నుంచి తిరిగి వెళ్తూ బి.కొత్తకోట మండలంలోని తానామిట్ట చెక్ పోస్టును, ఇక్కడినుంచి అరకిలోమీటరు దూరంలోని సరిహద్దును పరిశీలించారు. తర్వాత పెద్దతిప్పసముద్రం మండలంలోని అంకాలమడుగు, చెన్నరాయునిపల్లె ఆంధ్రా–కర్ణాటక సరిహద్దును పరిశీలించారు. డీఐజీ వెంట మదనపల్లె డీఎస్పీ రెడ్డెయ్యనాయుడు, సీఐలు రాజారెడ్డి, రాజా రమేష్ ఉన్నారు.

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్

ములకలచెరువు: అన్నమయ్య జిల్లాలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక సర్కిల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపకుండా ఉండేందుకు కళాశాలలో అవగాహన కార్యక్రమాలు పోలీసు సిబ్బంది నిర్వహిస్తారన్నారు. ఎర్రచందనం, కర్ణాటక మద్యం అక్రమ రవాణా, నాటు సారా తయారీపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. పెండింగ్ లోని కేసులను సత్వరం పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్ఐలకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఐ రాజ రమేష్, ఎస్ఐలు గాయత్రి, లోకేష్ రెడ్డి, నరసింహులు ఉన్నారు.

12 మండలాల్లో వర్షం



ఓబులవారిపల్లెలో వర్షానికి సాగుతున్న పాములేరు వంక

రాయచోటి: అన్నమయ్య జిల్లా పరిధిలోని 12 మండలాల్లో సోమవారం అర్ధరాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. మిగిలిన 18 మండలాల్లో వర్షపు జాడ కనిపించలేదు. జిల్లాలోని సుండుపల్లిలో 33.6 మిల్లీమీటర్లు, వీరబల్లిలో 8 , రాజంపేట 14.6 , పుల్లంపేట 39.6 , ఓబులవారిపల్లి 26 , కోడూరు 15, పెద్దమండెం 31.6 , గుర్రంకొండ 29.6 , కెవిపల్లి 18.2, పీలేరు 10 , కలికిరి 25 , వాల్మీకిపురంలో 25.2 మి.మీలు వంతున వర్షపాతం నమోదైంది.

జేఎన్‌టీయూలో బీటెక్ ఫలితాలు విడుదల

పులివెందుల రూరల్: పులివెందుల జేఎన్‌టీయూ కళాశాలలో ఆగస్టు/సెప్టెంబర్ –2024 నెలలో నిర్వహించిన బీటెక్ రెండవ సంవత్సరం రెండవ సెమిస్టర్, మూడవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్ 20)రెగ్యులర్ ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఈ.అరుణ కాంతి, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జీ.వి.సుబ్బారెడ్డి తెలిపారు. పరీక్షా ఫలితాలను కళాశాలల వెబ్ సైట్‌లో పొందుపరిచామని, విద్యార్థులు వెబ్ సైట్‌లో పరీక్షా ఫలితాలు తెలుసుకోవచ్చునన్నారు.

'ఉత్తమ ఉపాధ్యాయ విశిష్టత' పురస్కారం ప్రదానం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలోని రసాయన శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు 'ఉత్తమ ఉపాధ్యాయ విశిష్ట ప్రతిభా పురస్కారం –2024' అందుకున్నారు. హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పురస్కారం ట్రస్ట్ చైర్మన్, విశ్రాంత డీజీపీ డాక్టర్ పూర్ణచంద్రరావు, ఇ. వీరయ్య అందజేశారు. విద్యా, పరిశోధనా రంగాలలో కృష్ణరావు చేసిన సేవలు, కృషి పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారం ప్రదానము చేశారు. ఆచార్య కృష్ణారావు విశ్వవిద్యాలయంలో 'పాలిమర్ బయోమెటీ డిజైన్ అండ్ సింథసిస్' పరిశోధన బృందానికి నాయకత్వం వహిస్తున్నారు.

చదువుతో పాటు క్రీడలపై శ్రద్ధ పెట్టండి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధికారులు

రాయచోటి టౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైన కూడా శ్రద్ధ పెట్టే విధంగా ప్రోత్సహించాలని అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రమైన రాయచోటిలోని మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నియోజక వర్గ స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడలను ప్రారంభించారు. మొదటి రోజు ఖో ఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. అనంతరం స్కూల్ గేమ్స్ కోఆర్డినేటర్ అంబటి జగదీశ్వరయ్య మాట్లాడుతూ ఇక్కడికి వెయ్యి మందికి పైగా వచ్చిన క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ క్రీడా పోటీలను రాష్ట్ర వ్యాయామ విద్యాసంచాలకులు భానుమూర్తి రాజు పరిశీలించి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ ఆనందబాబు, మాసాపేట వార్డు కౌన్సిలర్ ఈశ్వర్ ప్రసాద్, గిరిబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకట్రామరాజు, అమర్నాథరెడ్డి, రెడ్డెయ్య, నరసరాజు, ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఎఫ్ఏయూ పరీక్షా ఫలితాలు విడుదల

ఏఎఫ్‌యూ: కడపలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్‌కు సంబంధించిన 1వ సెమిస్టర్ నుంచి 8వ సెమిస్టర్ వరకు ఇన్‌స్టంట్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి రిజిస్ట్రార్, కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్ ఎన్.రాజేష్ కుమార్ రెడ్డి విడుదల చేశారు. మంగళవారం పరీక్ష విభాగంతో కలిసి ఫలితాలను విడుదల చేశారు. ఫలితాలను కళాశాల వెబ్ సైట్‌లో పొందుపరిచారు.

లైసెన్సు లేకుండా టపాసులు అమ్మడం నేరం



టపాసుల వ్యాపారస్తులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి: లైసెన్సు లేకుండా టపాసులు అమ్మడం చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, టపాసులు అగ్ని ప్రమాదాలకు కారకం కాబట్టి భద్రతా చర్యలను ఖచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో జిల్లా కలెక్టర్ జిల్లాలో టపాసులు అమ్మేందుకు లైసెన్సు పొంది ఉన్న వ్యాపారస్తులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని లైసెన్సులో తెలిపిన నిబంధనల మేరకు అగ్నిమాపక పరికరాలు, నిబంధనల మేరకు టపాసుల సామర్థ్యాన్ని బట్టి నీటి నిల్వ ఉండాలన్నారు. టపాసుల రేట్లు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ సమావేశంలో మదనపల్లి, రాజంపేట సబ్ కలెక్టర్లు మేఘ స్వరూప్, వైఖోన్ నదియా దేవి, రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, డీఎఫ్ఓ అనీల్ కుమార్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

రాయచోటి: కేజీబీవీ విద్యార్థులను సొంత పిల్లలుగా భావించి వారి సమస్యలు సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. కేజీబీవీ పాఠశాలలలో మౌళిక సదుపాయాలపై రాజీ పడరాదని కలెక్టర్ సూచించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక హాల్‌లో అన్నమయ్య జిల్లాలోని కేజీబీవీలలో మౌళిక సదుపాయాలు తదితర అంశాలపై జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్ రెడ్డితో కలిసి కేజీబీవీ ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రామాపురం మండల కేజీబీవీ ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత జిల్లాలోని కేజీబీవీలపై, వివిధ అంశాలను కలెక్టర్‌కు వివరించారు. అన్నమయ్య జిల్లాలో మొత్తం 22 కేజీబీవీలు ఉన్నాయన్నారు. అనంతరం కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ మాట్లాడుతూ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారులు మినహా బయట వ్యక్తులను పాఠశాలలోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. మరుగుదొడ్ల పరిశుభ్రత, రక్షిత మంచినీరు, మంచి భోజన వసతి, పిల్లలు నిద్రించడానికి తగిన వసతులు తదితర కనీస మౌళిక సదుపాయాలపై ఎలాంటి రాజీ పడరాదన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

గాలివీడు: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందజేస్తామని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గాలివీడు మండలం గోపనపల్లెలో 'ఇది మంచి ప్రభుత్వం' ప్రజా దర్బార్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరై మాట్లాడారు. రాయచోటిని ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తామన్నారు. గతంలో వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి వారిని సొంత పనులకు ఉపయోగించుకుని ఇప్పుడు గాలికి వదిలేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే డీఎస్సీకి నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. అన్న క్యాంటీన్లు ప్రారంభించామన్నారు. విజయవాడలో వరద బాధితులకు త్వరితగతిన సహాయ కార్యక్రమాలు చేపట్టామన్నారు. దీపావళికి మూడు సిలిండర్లు ఇచ్చే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. త్వరలో కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామన్నారు. గాలివీడు మండలం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. భూ ఆక్రమణల సమస్య పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

చిన్నమండెం: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చిన్నమండెం మండలం మల్లూరులో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా 80 శాతం సబ్సిడీతో రైతులకు ఉలవలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రానాయక్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



చిన్నమండెంలో సబ్సిడీ ఉలవలను రైతులకు అందజేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

- చిన్నమండెం మండల పరిధిలోని బోరెడ్డిగారిపల్లెలోని తన నివాస గృహంలో మంత్రి ప్రజా దర్బార్ నిర్వహించి వినతులు స్వీకరించారు.

మయూరం.. నయన మనోహరం



ఘాట్‌రోడ్డు గోడపై వెళ్తున్న నెమళ్లు

అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డుపై మంగళవారం తెల్లవారుజాము నెమళ్ల గుంపు సందర్శకులను కనువిందు చేసింది. కొండపైకి వెళ్తున్న సందర్శకులకు ఘాట్‌రోడ్డు రక్షితగోడపై ఒకదానివెంట ఒకటి ఐదు నెమళ్లు వెళ్తూ కనిపించాయి. నిశ్శబ్దంగా ఉన్న వాతావరణం నెమళ్ల కూతలతో సందర్శకులు అనుభూతి పొందారు. వాతావరణం చల్లగా మారి మేఘాలు కొండను కమ్మేయడంతో వన్యప్రాణులు రోడ్లపైకి వస్తున్నాయి.

– బి.కొత్తకోట

అమ్మా.. ఆకలి!

'అమ్మా... ఆకలేస్తోంద'ని
ఎన్నిసార్లు అడిగారో...ఎంతలా అలిసిపోయారో..
అమ్మ తినిపించే గోరు ముద్ద కోసం
ఎంతగా తపించిపోయారో... తల్లడిల్లిపోయారో..
అన్నం ముద్ద దొరక్క... ఆకలి తీరక
ఊపిరొదిలిన ఆ పాపలకే తెలుసు..
పిల్లల ఆకలి తీర్చడం కోసం.. ఎన్ని గడపలు
తొక్కారో.. కన్నబిడ్డలు దూరమై..
ఎంత వేదన అనుభవిస్తున్నారో...
బిడ్డలను కోల్పోయిన ఆ తల్లిదండ్రులకే తెలుసు..
నింగిలోకి రాకెట్లు దూసుకుపోతున్న యుగంలోనూ ఆకలిచావులు పలకరిస్తున్నాయి.
పౌష్టికాహారం దొరక్క అర్ధంతరంగా ఆగిన ఈ రెండు నిండు ప్రాణాలు.. పాలకుల తీరును ప్రశ్నిస్తున్నాయి. సమాజంలోని అంతరాలకు అద్దం పడుతున్నాయి. జానెడు పొట్టకు గుక్కెడు పాలు అందించని అధికారుల అలసత్వాన్ని ఎక్కిరిస్తున్నాయి. ఆకలైనప్పుడు పిడికెడు అన్నం దొరకనప్పుడు... జీవించడానికి అవసరమైన భరోసా ఇవ్వనప్పుడు.. కోట్ల రూపాయల బడ్జెట్లు ఎందుకంటూ హేళనగా నవ్వుతున్నాయి.

సిద్దవటం: పౌష్టికాహార లోపంతో ఇద్దరు చిన్నారులు చని పోయిన సంఘటన అన్నమయ్య జిల్లా సిద్దవటం మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఈ విషయాన్ని వైద్య సిబ్బంది ధ్రువీకరించారు. సిద్దవటం మండలంలోని బొగ్గిడివారంపల్లె పంచాయతీ నిర్మలగిరి కాలనీ వద్ద ఖాళీ ప్రదేశంలో సంచార జీవనం చేసేవారు గుడారం వేసుకుని ఉంటున్నారు. ఈ గుడారంలో నివాసం ఉంటున్న 5 సంవత్సరాలు, 2 సంవత్సరాల వయస్సుగల బాలికలకు ఇద్దరికి అస్వస్థతగా ఉందని పడుకొని ఉన్నా రు. పిలిస్తే పలకడం లేదని, రాత్రి నుంచి ఇరువురికి జ్వరం వస్తోందని, వారి గుడిసెలో ఉన్న పెద్దఅమ్మాయి సమీపంలోని గ్రామస్తులకు తెలిపింది. గ్రామస్తులతో విషయం తెలుసుకున్న బొగ్గిడివారిపల్లె గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న ఏఎన్ఎం, ఆశా వర్కర్‌లు, 104 సిబ్బంది అక్కడికి వెళ్లి పరిశీలించారు. అప్పటికే ఇద్దరు బాలికలు మరణించి ఉన్నారు. వారికి శరీరం పైన ఎలాంటి గాయాలు, విషపురుగులు కుట్టినట్లు గాని లేవన్నారు. కాగా చనిపోయిన పిల్లల తల్లిదండ్రులు సంచార జీవనం చేస్తున్నారు. వీరికి ఆరుగురు పిల్లలు. మంగళవారం చివరి ఇద్దరు పిల్లలు చనిపోయారు. వీరు ఈ ప్రాంతానికి వచ్చి సుమారు 10 రోజులు కావొస్తోందని, పిల్లలు ఇద్దరు చనిపోయినప్పుడు వీరి తల్లి దండ్రులు ప్లాస్టిక్ వస్తువులు ఏరుకునేందుకు, భిక్షాటన కోసం మాధవరం గ్రామంలోకి వెళ్లారు. కాగా.. ఇద్దరు చిన్నారుల మృతి వార్త తెలుసుకుని తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు వేదన చెందారు.

మృత్యు కౌగిలికి చేరిన ఇద్దరు చిన్నారులు



చనిపోయిన ఇద్దరు పిల్లల వద్ద వైద్య బృందం

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



మధుసూదన్ రెడ్డి (ఫైల్)

రామసముద్రం : రామసముద్రం మండలం కేసీ పల్లి పంచాయతీ మిట్టయంబాడి గ్రామానికి చెందిన చింతల మాధవరెడ్డి కుమారుడు సి.మధుసూదన్‌రెడ్డి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య మంగళవారం తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు గత శనివారం పుంగనూరు వెళ్లి వస్తానని వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి రాలేదని తెలిపారు. చుట్టు పక్కల ప్రాంతాల్లో సమీప బంధువుల కుటుంబాలు, స్నేహితులను విచారించినా ఎక్కడా ఆచూకీ లభించలేదని చెప్పారు. అదృశ్యంపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారును తప్పించబోయి అదుపుతప్పిన ఆటో

మదనపల్లె : ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి, ఆటో అదుపుతప్పి ఓ మహిళ గాయపడిన సంఘటన మంగళవారం ములకలచెరువు మండలంలో జరిగింది. పెద్దపాలెం గ్రామానికి చెందిన వై.నందిని(30) ఆటోలో ములకలచెరువు నుంచి పెద్దపాలెం వెళుతుండగా, మార్గమధ్యంలో ఎదురుగా వచ్చిన కారును తప్పించబోయి ఆటో అదుపు తప్పింది. ప్రమాదంలో నందిని తీవ్రంగా గాయపడి చేయి విరిగింది. గమనించిన స్థానికులు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని ఏపిలంకపల్లెలో జరిగిన ఘర్షణలో ఒకరికి గాయాలయ్యాయి. బాధితుడు సుబ్బారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం రాత్రి ఏపిలంకపల్లెలో టీడీపీకి చెందిన ఇరువురు వాగ్వాదం చేసుకున్నారు. ఇది తీవ్రమై సుబ్బారెడ్డిపై అదే గ్రామానికి చెందిన కిరణ్, శంకర్‌లతో పాటు మరి కొంత మంది కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో సుబ్బారెడ్డి తలకు గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని మెరుగైన చికిత్స కోసం కడపకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సారా విక్రేత అరెస్టు

కలికిరి : నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి తెలిపారు. పట్టణ పరిధిలోని బండకాడపల్లిలో నాటు సారా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించారు. భార్గవ్ సారా విక్రయిస్తున్నట్లు గుర్తించి అతని వద్ద నుంచి నాలుగు లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి వాల్మీకిపురం కోర్టుకు తరలించగా నిందితునికి రిమాండ్ విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కమలాపురం : నగర పంచాయతీ పరిధిలోని అప్పాయపల్లె గాంధీ నగర్‌కు చెందిన ఇరుగుడి చిన్నబాబు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో లిక్కర్‌లో పురుగుల మందు కలుపుకుని తాగాడు.

డిప్యూటీ తహసీల్దార్ల బదిలీలు

- 42 మందికి స్థాన చలనం
- 11 మందికి ఇన్‌చార్జి తహసీల్దార్లుగా నియామకం

రాయచోటి : అన్నమయ్య జిల్లా పరిధిలో 53 మంది డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం బదిలీ ఉత్తర్వులను కలెక్టర్ విడుదల చేశారు. వీరిలో 11 మందికి ఇన్‌చార్జి తహసీల్దార్లుగా, 42 మంది డిప్యూటీ తహసీల్దార్లుగా స్థాన చలనం కల్పించారు. మండలాల వారీగా బదిలీల వివరాలు ఇలా ఉన్నాయి..

పేరు	బదిలీ స్థానం
1. జి.శ్రీనివాసరావ్	నిమ్మనపల్లె మండలం
2. ఎస్.నవీన్	కలికిరి మండలం
3. బి.రవీంద్రనాయక్	తంబళ్లపల్లె మండలం
4. జి.ఇస్సాక్	హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్-2 పీలేరు
5. ఎ.రెడ్డిప్రసాద్	ఓబులవారిపల్లె మండలం
6. డి.శ్రీనివాసులు	నందలూరు మండలం
7. కె.కృపావతి	రామాపురం మండలం
8. ఎ.వెంకటరమణ	చిన్నమండెం మండలం
9. శ్రీధర్‌రెడ్డి	గాలివీడు మండలం
10. ఎం.వి.ఎస్.తిమ్మారెడ్డి	డీసీఎస్ఓ ఆఫీసు, అన్నమయ్య జిల్లా కలెక్టరేట్
11. ఎస్.యునిత్ కుమార్‌రెడ్డి	వీరబల్లి మండలం
12. కె.గోపి	రాయచోటి మండలం
13. ఆర్.సురేష్ బాబు	గాలివీడు మండలం
14. బి.రెడ్డిబాబు	చిన్నమండెం మండలం
15. పి.అజార్ అలీఖాన్	డీసీఎస్ఓ ఆఫీస్, అన్నమయ్య జిల్లా కలెక్టరేట్
16. పి.ఫణిక్రిష్ణ	అడ్మిన్ సెక్షన్, అన్నమయ్య జిల్లా కలెక్టరేట్
17. షేక్ ఉస్మాన్ సాహెబ్	కో ఆర్డినేషన్ సెక్షన్, అన్నమయ్య జిల్లా కలెక్టరేట్
18. టి.వెంకటస్వామి	వాల్మీకిపురం మండలం
19. ఆర్.ఎం.బాబ్జి	డీసీఎస్ఓ అన్నమయ్య జిల్లా కలెక్టరేట్
20. జి.అస్లామ్ బాషా	మదనపల్లి తహసీల్దార్ కార్యాలయం
21. ఎ.బావాజాన్	గుర్రంకొండ మండలం
22. ఎ.గురు ప్రసాద్	ఎల్.ఎ సెక్షన్, కలెక్టరేట్ అన్నమయ్య జిల్లా
23. ఎం.జ్యోతి	పెనగలూరు మండలం
24. ఎస్.వి.ఎస్.హరిత	నందలూరు మండలం...
25. పి.సాయి రమ్య	రాజంపేట తహశిల్దార్ కార్యాలయం
26. జి.వి.రామయ్య	రైల్వేకోడూరు మండలం
27. పి.నరసింహకుమార్	అన్నమయ్య జిల్లా కలెక్టరేట్
28. బి.రెడ్డెన్న	టి.సుండుపల్లి మండలం
29. వై.ఫజులుల్లా	డిసిఎస్ఓ అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం
30. జి.రవికుమార్	డీసీఎస్ఓ అన్నమయ్య జిల్లా కలెక్టరేట్
31. పి.మోహన్ క్రిష్ణ	చిట్వేలి మండలం
32. ఎస్.ఫైరోజ్ ఖాన్	డీసీఎస్ఓ అన్నమయ్య జిల్లా కలెక్టరేట్
33. ఎ.సిద్ధేశ్వర రావ్	డీసీఎస్ఓ అన్నమయ్య జిల్లా కలెక్టరేట్
34. ఎం.ప్రసాద్	డిసిఎస్ఓ అన్నమయ్య జిల్లా కలెక్టరేట్..
35. జి.రెడ్డెప్పరెడ్డి	పీలేరు మండలం
36. పి.ఆయూబ్ లఖాన్	అన్నమయ్య జిల్లా కలెక్టరేట్
37. స్యామ్ వంశి	రాయచోటి తహశిల్దార్ కార్యాలయం
38. ఎం.ఎస్.కార్తీక్ ప్రభు	జెసి సిసి కలెక్టరేట్ అన్నమయ్య జిల్లా
39. ఈ.చంద్ర శేఖర్	పీలేరు మండలం
40. విజయ్ కుమార్ రెడ్డి	డిసిఎస్ఓ అన్నమయ్య జిల్లా కలెక్టరేట్
41. సి.హెచ్.నారాయణరెడ్డి	రామసముద్రం మండలం
42. వై.ప్రవీణ్	ఎపిఎస్‌సిఎస్‌సి లిమిటెడ్ జిల్లా మేనేజర్

ఇన్‌చార్జి తహసీల్దార్లు...

కొంతమంది డిప్యూటీ తహసీల్దార్లను ఆయా మండలాల ఇన్‌చార్జి (ఎఫ్.ఎ.సి)లుగా నియమిస్తూ కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాలు జారీ చేశారు.

1. జి.తపస్విని	కురబలకోట
2. సయ్యద్ అహ్మద్	పెద్దమండ్యం
3. కె.అరవింద్ కిషోర్	పుల్లంపేట
4. పి.లక్ష్మీ ప్రసన్న	లక్కిరెడ్డిపల్లె
5. ఎ.క్రాంతికుమార్	కె.వి.పల్లి
6. ఎ.ఫణికుమార్	కలకడ
7. కె.ప్రదీప్	ములకలచెరువు
8. డి.హరికుమార్	తంబళ్లపల్లె
9. ఎస్.వెంకటేశ్వర్లు	సంబేపల్లె
10. ఎస్.పామిలేటి	వాల్మీకిపురం
11. ఎస్.రామాంజనేయులు	రామాపురం

అలా వచ్చి.. ఇలా వెళ్లారు!

– 37 రోజులకే తహసీల్దార్ బదిలీ



శ్రీధర్‌రావు

బి.కొత్తకోట : ఏ అధికారికైనా బదిలీ జరిగితే కనీసం ఆరునెలలైనా ఉంటారు. అయితే బి.కొత్తకోటకు నియమితులైన తహసీల్దార్ మాత్రం బాధ్యతలు చేపట్టిన 37వ రోజునే బదిలీ అయ్యారు. ఉమ్మడి కడప జిల్లాకు చెందిన బి.శ్రీధర్‌రావును గతనెలలో కలెక్టర్ బి.కొత్తకోట తహసీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఇక్కడి రాజకీయ పరిస్థితులు, కార్యాలయ పరిస్థితులను తెలుసుకున్న ఆయన రెండువారాలు విధుల్లో చేరలేదు. తర్వాత ఆగస్టు 16న విధుల్లో చేరిన ఆయన కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది పని తీరులో మార్పు తీసుకొచ్చారు. వీఆర్‌ఓల విధి నిర్వహణపై అవగాహన కల్పించి మార్పు తెచ్చారు. రెవెన్యూ పాలన, పనితీరు మెరుగుపడి గాడిన పడింది. అయితే ఏం జరిగిందో కాని సోమవారం శ్రీధర్‌రావును అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లెకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీనితో రెవెన్యూ వర్గాలు విస్తుపోతున్నాయి. ఆయన బదిలీ వెనుక కారణమేమిటని చర్చించుకుంటున్నారు. కాగా బి.కొత్తకోటకు నూతన తహసీల్దార్‌గా జిల్లాకు కేటాయించిన బి.నరేంద్రకుమార్‌ను బదిలీ చేశారు.

కబ్జా కోరల్లో లోతు వంక చెరువు!

- ఆక్రమణదారులకు వన్‌బీ!
- ఉన్నతాధికారులకు ఆయకట్టు రైతుల ఫిర్యాదు



లోతు వంక చెరువు భూమిలో చెట్లు నాటిన ఆక్రమణదారులు

కురబలకోట : చెరువులంటే రైతులకు సాగునీరు, ఊర్లకు తాగునీరు అందించేవి. మూగజీవాలకు ఎంతో ఆదరువు. పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలకు నెలవు. మరెందరికో బతుకుదెరువు. కుల వృత్తులకు జీవనాధారంగా ఉండేవి. మా ఊరి చెరువని గొప్పగా చెప్పుకునేవారు. అంతేకాదు చెరువు నిండితే పండగ చేసుకునేవారు. ఇలాంటి చెరువులను కూడా కబ్జా చేస్తున్నారు కొందరు అక్రమార్కులు. వీరికి కొందరు నాయకుల ఆశీస్సులతో పాటు రెవెన్యూ అధికారులు అండదండగా నిలుస్తున్నారు. ఇది చెరువు భూమి అని కూడా చూడకుండా వన్‌బీ కూడా ఇచ్చారు ఇదివరలో పనిచేసిన ఓ తహసీల్దారు. ఆయకట్టు రైతులు అభ్యంతరం చెప్పినా ఆ తహసీల్దారు పట్టించుకోకుండా అక్రమార్కుల ప్రలోభాలకు తలొగ్గాడు. కబ్జాదారులకు హక్కులు కల్పించాడు. దీని వెనుక లక్షలు చేతులు మారినట్లు జోరుగా విన్పిస్తోంది. లోతు వంక చెరువు ఆయకట్టు రైతులు, గ్రామస్తుల కథనం మేరకు..

కురబలకోట మండలంలోని కంటేవారిపల్లె సమీపంలో లోతు వంక చెరువు ఉంది. మండలంలోని ఇరిగేషన్ చెరువులలో ఇది పెద్దది. దీనికి ఆనుకునే హార్సిలీహిల్స్ అటవీ ప్రాంతం ఉంది. హిల్స్ నుంచి వచ్చే వర్షపు నీరు ఇక్కడి పొలాలపై పడి పంటలు దెబ్బతినేవి. రైతాంగం నష్టపోయేది. దీంతో 2006లో ఇక్కడున్న 25 ఎకరాల భూమిని రైతుల నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఇదంతా డీకేటీ భూమి. అప్పట్లో ప్రభుత్వం పరిహారం కూడా ఇచ్చింది. తర్వాత ఇందులో ఇరిగేషన్ శాఖ లోతువంక పేరుతో కొత్తగా చెరువు నిర్మించింది. దీంతో దీనికి కొత్త చెరువుగా పేరు వచ్చింది. ఇదిలా ఉండగా చెరువు కోసం రైతులు ఇచ్చిన 25 ఎకరాల భూమిని రికార్డులలో తొలగించకుండా అప్పటి రెవెన్యూ అధికారులు అలాగే వదిలేశారు. దీంతో రికార్డులలో రైతుల పేరుతో ఉన్న ఈ భూములపై కొందరు కన్నేశారు. కొందరు నాయకుల ప్రోద్బలంతో రైతుల వద్ద కొన్నట్లుగా ఆక్రమణదారులు రికార్డులు సృష్టించారు. ఇదివరలో పనిచేసిన ఓ రూరల్ సర్కిల్ సీఐ బినామీ పేరుతోను, మరో మాజీ ఉద్యోగితో సహా మరి కొందరు ఇక్కడ పది ఎకరాలకు పైగా ఆక్రమించుకున్నారు. ఇందులో బోర్లు వేయడంతో పాటు పండ్ల చెట్లు నాటారు. ఫెన్సింగ్ చేసి స్వాధీనంలో ఉంచుకున్నారు. కట్టడాలు కూడా నిర్మించారు. వాస్తవానికి ఇది చెరువు కోసం వదిలిన డీకేటీ భూమి. అక్రమంగా ఈ భూమిని ఆన్‌లైన్ చేసుకోవడంతో పాటు వన్‌బీ కూడా పొందారు. రెవెన్యూ రికార్డులలో ఇది చెరువుకు సంబంధించిన భూమి అని ఉన్నప్పటికీ ఇదివరకటి చేతి వాటం తహసీల్దారు ప్రలోభాలకు తలొగ్గి అక్రమార్కులకు వన్‌బీ ద్వారా హక్కులు కల్పించినట్లు ఆయకట్టు రైతులు ఉన్నతాధికారులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. చెరువు భూమి ఆపై డీకేటీగా ఉన్న భూమిని ఆన్‌లైన్ చేసి వన్‌బీతో హక్కులు కల్పించడం అక్రమం. ఆయకట్టు రైతులు ఇదివరలో చేయించిన సర్వేలో కూడా ఇది చెరువు భూమిగా తేలిందని చెబుతున్నారు. ఈ విషయమై ప్రస్తుత తహసీల్దారు తపస్వినిని విచారించగా ఆక్రమణదారుల ఆధీనంలోని చెట్లు నాటిన భూమిని సర్వే చేస్తామన్నారు. ఎంత మేరకు చెరువు ఆక్రమణకు గురైంది సర్వే ద్వారా నిర్దిష్టంగా గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపామన్నారు. వారి అనుమతి రాగానే వెంటనే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. కాగా చెరువు భూమి ఆక్రమణదారులుగా చెబుతున్న వారిని విచారించగా ఏళ్ల కిందట ఈ భూమిని రైతుల వద్ద కొన్నామన్నారు. తమ స్వాధీనంలో ఉన్న భూమి చెరువుకు సంబంధించినదయితే నిరభ్యంతరంగా వదిలివేస్తామని వెల్లడించారు. తహసీల్దారుకు కూడా ఈ విషయాన్ని తెలిపినట్లు వారు పేర్కొన్నారు.

అధికారుల బదిలీలు

కలికిరి : కలికిరి సబ్ రిజిస్ట్రారు ఎస్.సత్యప్రసాద్ చిత్తూరు జిల్లా కార్వేటినగరం సబ్ రిజిస్ట్రారుగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బి.కొత్తకోట సబ్ రిజిస్ట్రారు పార్థసారథిని కలికిరి సబ్ రిజిస్ట్రారుగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కుప్పం సబ్ రిజిస్ట్రారు కార్యాలయం నుంచి సీనియర్ అసిస్టెంట్ భువనేశ్వరిని, వాల్మీకిపురం సబ్ రిజిస్ట్రారు కార్యాలయం నుంచి జూనియర్ అసిస్టెంట్ జశ్వంత్ రాయల్‌ను, మదనపల్లి కార్యాలయ సబ్‌ఆర్డినేట్ నుంచి రెడ్డెప్పను కలికిరి కార్యాలయానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ పర్వీనాను వాల్మీకిపురానికి, జూనియర్ అసిస్టెంట్ దివ్యను మదనపల్లి కార్యాలయానికి, కార్యాలయ సబ్ ఆర్డినేటర్ సీవీ బాలాజీని చిన్నగొట్టిగల్లు కార్యాలయానికి బదిలీ చేశారు.

తహసీల్దారు కార్యాలయంలో...

మండల సర్వేయర్ దేవిని కలకడ మండల తహసీల్దారుగా బదిలీ చేశారు. అన్నమయ్య జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న పెద్దిగాని రెడ్డెప్ప కలికిరి మండల సర్వేయరుగా బదిలీ అయ్యారు. నిమ్మనపల్లి తహసీల్దారు కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ గిరిప్రసాద్‌ను కలికిరి తహసీల్దారు కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు.

రెండు కిలోల గంజాయి స్వాధీనం

ఇద్దరు నిందితుల అరెస్ట్



గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చూపుతున్న పోలీసులు

మదనపల్లె : పట్టణంలోని చంద్రాకాలనీ, లక్ష్మీనగర్, గురుకుల పాఠశాల వెనుకవైపున అవుల లక్ష్మయ్య ఖాళీ ప్రదేశంలో 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ కె.రామచంద్ర తెలిపారు. మంగళవారం సాయంత్రం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐ మాట్లాడుతూ... రాష్ట్రాన్ని మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా చేయాలని సంకల్పించిన ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు జిల్లాను డ్రగ్స్‌రహిత జిల్లాగా చేయాలనే ఉద్దేశంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారన్నారు. ఇందులో భాగంగా మంగళవారం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రాకాలనీలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. గురుకుల పాఠశాల వెనుక వైపు, లక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్న అవుల లక్ష్మయ్య ఇంటి పక్కన ఖాళీప్రదేశంలో కనపడిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని సోదాలు నిర్వహించామన్నారు. ఇద్దరి వద్ద సుమారు 2 కిలోల గంజాయి లభ్యమైందన్నారు. దీంతో వెంటనే గంజాయిని స్వాధీనం చేసుకుని క్రైమ్ నెం.244/2024, 8సి, 20బి, 29 ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదుచేసి, అవుల లక్ష్మయ్య, చీకలగుట్ట గౌతమీనగర్‌కు చెందిన బేల్దారి మేస్త్రీ దనియాల రమేష్(48)లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

గ్రామస్తుల అభిప్రాయం మేరకే ఆలయాల నిర్మాణం



ప్రజాభిప్రాయం సేకరిస్తున్న దేవదాయ మండల అధికారులు

ఓబులవారిపల్లె : మంగంపేట పునరావాస కాలనీ ఆర్‌ఆర్-5లో గ్రామస్తుల అభిప్రాయం మేరకే ఆలయాల నిర్మాణం జరుగుతుందని దేవదాయ అధికారి దుర్గా ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పునరావాస కాలనీలో ఆలయ నిర్మాణంపై గ్రామస్తుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ మంగంపేట, కాపుపల్లె హరిజనవాడ, అరుంధతివాడ మూడు గ్రామాల ప్రజల పునరావాసం కోసం ఆర్‌ఆర్-5లో ఏర్పాటు చేయనున్న గుడులు, ఆలయాల నిర్మాణంపై గ్రామస్తుల అభిప్రాయం తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీర్‌మున్నీ, ఎంపీడీఓ విజయారావు, రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ పి.మహేష్, మంగంపేట పునరావాస గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నగలు చోరీ జరిగినా పోలీసులు పట్టించుకోలేదు

కడప అర్బన్ : ప్రొద్దుటూరు టౌన్ శ్రీనివాసనగర్ వీధిలో నివాసం ఉంటున్న షేక్ ఇబ్రహీం కుమారుడు షేక్ జిలానీ బాషా, తన భార్య, కుటుంబ సభ్యులతో మంగళవారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ఈ ఫిర్యాదునుజిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు స్వీకరించారు. తగిన చర్యలు తీసుకోవాలని ప్రొద్దుటూరు టూటౌన్ పోలీసులను ఆదేశించారు. ఈ సందర్భంగా బాధితుడు జిలానీ బాషా విలేకరులతో మాట్లాడారు. తాను గత 30 సంవత్సరాలుగా ప్రొద్దుటూరు టౌన్‌లోని పార్వతి ఆర్కేడ్ కాంప్లెక్స్, శేషుగారి వీధిలోని గ్రౌండ్‌ఫ్లోర్ రూం నంబర్ 3లో బంగారు పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నానన్నారు. ఈ ఆర్కేడ్‌లో నాలుగు రూములున్నాయన్నారు. సీసీ కెమెరాలు పనిచేయడం లేదన్నారు. ఈ ఆర్కేడ్‌లోకి వచ్చే దారిలో సీసీ కెమెరాలు మాత్రం పనిచేస్తున్నాయన్నారు. ఆగస్టు 25వ తేదీన రాత్రి 7:50 గంటల సమయంలో తన స్నేహితుడు వై.జయశంకర్‌తో కలిసి టిఫిన్‌ను పార్సిల్ కట్టించుకుని తిరిగి వచ్చానన్నారు. 10 నుంచి 15 నిమిషాల వ్యవధిలోనే తాను అంగడిలో పొట్లాలలో దాచి ఉంచిన దాదాపు 309 గ్రాముల బంగారు ఆభరణాలు పూలహారం (107 గ్రాములు), నల్లల దండ (30 గ్రాములు), మినీ హారం (20 గ్రాములు), రెండు పొరల భారత్ చైన్ (45 గ్రాములు), ప్యూర్ బంగారం (50 గ్రాములు), లేడీస్ బ్రాస్‌లెట్ (7 గ్రాములు) చైన్ (8 గ్రాములు), కుదువపెట్టుకున్న వస్తువులు (12గ్రాములు), చిల్లర బంగారు (30 గ్రాములు) దొంగిలించారన్నారు. ఈ పని స్వర్ణకారునికి తప్ప ఎవరికీ సాధ్యంకాదన్నారు. ఈ సంఘటనపై ప్రొద్దుటూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎలాంటి కేసు నమోదు చేయకపోగా తననే సీఐ యుగంధర్ తప్పులు పడుతున్నారని వాపోయారు. కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయమని ఎన్నిసార్లు బతిమలాడినా ప్రయోజనం లేదన్నారు. ఈ చోరీపై పోలీసు ఉన్నతాధికారులు విచారించి తమ బంగారు ఆభరణాలను దొంగిలించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరాడు.

పట్టాభూమి కబ్జాపై ఫిర్యాదు



పట్టాభూమిలో ఏర్పాటు చేసిన కంచె

ఓబులవారిపల్లె : దశాబ్ద కాలంగా తన అనుభవంలో ఉన్న పది ఎకరాల పట్టా భూమిలో బోరువేసి అక్రమంగా కంచె ఏర్పాటు చేశారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గుత్తిరెడ్డి హరినాథ్ రెడ్డి మంగళవారం తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2012వ సంవత్సరంలో కొర్లకుంట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు. 972లో పది ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్నానన్నారు. అప్పటి నుంచి తన ఆధీనంలో భూమి ఉందని, అయితే చెన్నరాజుపోడు గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు సంబంధిత సర్వే నంబర్లు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. తన స్వాధీనంలో ఉన్న పది ఎకరాల భూమిలో సిమెంట్ స్థంభాలు ఏర్పాటు చేసి మంగళవారం తెల్లవారుజామున అక్రమంగా బోరు వేశారని ఆరోపించారు. అధికారం ఉందని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, ఇప్పటికే కోర్టు ద్వారా ఆర్డర్ కూడా పొంది ఉన్నానని తెలిపారు. తమకు న్యాయం చేయాలని తహశీల్దార్ పీర్ మున్నీకి, ఎస్‌ఐ పి.మహేష్‌కు ఆయన ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ పీర్ మున్నీ మాట్లాడుతూ సర్వే నంబరు. 972 సబ్ డివిజన్ జరగలేదని, సర్వే నిర్వహించి భూమికి హద్దులు చూపిస్తామన్నారు.

ద్విచక్ర వాహనం, టాటా మ్యాజిక్ వాహనం ఢీ

– ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గన్నేరు చంటి

పుల్లంపేట : కడప-చెన్నై జాతీయ రహదారిలోని పుల్లంపేట మండలం రామక్కపల్లి వద్ద మంగళవారం రాత్రి ద్విచక్రవాహనం, టాటా మ్యాజిక్ వాహనం ఢీ కొన్న సంఘటనలో రెడ్డిపల్లి గ్రామానికి చెందిన గన్నేరు చంటి (32) మృతి చెందాడు. శివరాం అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పుల్లంపేట ఎస్‌ఐ తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

సర్వజన బోధన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎంఎస్ రాజు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మెడికల్ సూపరింటెండెంట్ ఎమ్మెస్ రాజు

మదనపల్లె : ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మదనపల్లె సర్వజన బోధన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. ఎంఎస్ రాజు అన్నారు. మంగళవారం ఆసుపత్రిలోని అన్ని విభాగాల వైద్యులు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగుపరిచేందుకు అవసరమైన సూచనలు చేశారు. వైద్యులు సిబ్బంది అంకితభావంతో పనిచేసే ఆసుపత్రికి వచ్చే రోగులకు సంతృప్తికర స్థాయిలో వైద్యం అందించాలన్నారు. విధుల పట్ల ఎవ్వరూ నిర్లక్ష్యం చూపవద్దన్నారు. ముఖ్యంగా సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ మరింత మెరుగుపరిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

పూర్తిస్థాయి పదవీ బాధ్యతల స్వీకరణ

సూపరింటెండెంట్ ఎమ్మెస్ రాజు మదనపల్లె సర్వజన బోధన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా పూర్తిస్థాయి పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్‌గా పనిచేసిన పద్మాంజలి దేవిని పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి బదిలీ చేశారు. అయినా ఆమె ఇంతకాలం పాటు ఇక్కడే కొనసాగారు. మంగళవారం పద్మాంజలి దేవి తన విధుల నుంచి వైదొలగి పూర్తిస్థాయి బాధ్యతలను ఎమ్మెస్ రాజుకు అప్పగించారు.

ఇళ్ల నిర్మాణాల తొలగింపు



జేసీబీతో ఇళ్ల కట్టడాలు తొలగిస్తున్న దృశ్యం

కేవీపల్లె : మండలంలోని ఎంపీపల్లె పంచాయతీ గుండ్రేవారిపల్లె సమీపంలో గుణాతం స్థాయిలో ఉన్న సుమారు 20 ఇళ్ల నిర్మాణాలను రెవెన్యూ అధికారులు తొలగించారు. మండలంలోని గర్నిమిట్ట, ఎంపీపల్లె పంచాయతీలలో ఇళ్లు లేని దళితులు గత ప్రభుత్వ హయాంలో తమకు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. గుండ్రేవారిపల్లె గ్రామ సమీపంలో సర్వే నంబర్లు 1020, 1021/ఎ, 1021/బీలో సొంతంగా స్థలం చదును చేసుకుని గుణాతాలు నిర్మాణం చేపట్టారు. 50 మందికి పైగా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. అయితే మంగళవారం రెవెన్యూ అధికారులు చెరువు స్థలంలో అక్రమ నిర్మాణాలు జరిగాయని సుమారు 20 గుణాతాలు జేసీబీ సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా దళితులు మాట్లాడుతూ అప్పట్లో రెవెన్యూ అధికారుల సూచన మేరకే తాము నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. ఇందులో కొంతమంది పొజిషన్ సర్టిఫికెట్లు కలిగి ఉన్నట్లు చెప్పారు. కాలనీకి విద్యుత్ స్తంభాలు, బోరు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి టి.ఎల్. వెంకటేష్ మాట్లాడుతూ దళితుల కట్టడాలను కూల్చడం అన్యాయమన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ క్రాంతికుమార్‌ను వివరణ కోరగా చెరువు స్థలం ఆక్రమించి ఉన్న కట్టడాలు మాత్రమే తొలగించినట్లు తెలిపారు.

తిరుమలలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



తిరుపతి క్రైమ్ : తిరుమల అశ్విని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి ఈనెల 19వ తేదీన మృతి చెందాడు. తిరుమల వన్ టౌన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. తిరుమలలోని రాంబగీచా సమీపంలోని వినాయకుడి గుడి వద్ద ఓ వ్యక్తి కిందపడి ఉండగా గమనించి ఆస్పత్రికి తరలించారు. అయితే ఆ వ్యక్తి అప్పటికే బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందినట్లుగా అశ్విని ఆస్పత్రిలో వైద్యులు నిర్ధారించారు. అతని వద్ద ఉన్న ఆధారాల మేరకు అతని పేరు దూదేకుల సిద్దయ్య అని గుర్తించారు. వైఎస్సార్ జిల్లాలోని బ్రహ్మంగారి మఠం అతని సొంత ఊరని గుర్తించి అక్కడికి వెళ్లి విచారించారు. అయితే ఆ ఊరిలో అతనికి చెందిన వారు ఎవరూ లేరు. అతని వివరాలు తెలిసిన వారు తిరుమల వన్ టౌన్ పోలీసులను సంప్రదించాలని సీఐ విజయ్‌కుమార్ కోరారు.